సాక్షి విశాఖపట్నం

గురువారం । 20 । జూన్ । 2024



శిక్షణకు వేళాయె

డీఈఎల్ఈడీ కోర్సు ప్రవేశాలు పొందిన విద్యార్థులకు గురువారం నుంచి తరగతులు ప్రారంభంకానున్నాయి. 8లో



నేతన్న నేస్తానికి మంగళం!

టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలో నేతన్న నేస్తం పథకం గురించి ప్రస్తావన లేకపోవడంతో నేత కార్మికుల్లో అనుమానాలు, ఆందోళన మొదలయ్యాయి. 8లో



ప్రకృతి ఒడిలో సాగిపోయేలా..

ప్రముఖ పర్యాటక ప్రాంతాలైన తాటిగుడ, కటికి జలపాతాలకు మంచిరోజులొచ్చాయి. రోడ్డు సౌకర్యం అందుబాటులోకి రానుంది. 8లో

న్యూస్‌రీల్

30 నుంచి రాష్ట్ర స్థాయి పారా అథ్లెటిక్స్ పోటీలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా దివ్యాంగుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మాధవి

మహారాణిపేట: విశాఖ వేదికగా పోలీస్ బ్యారెక్స్ మైదానంలో ఈ నెల 30వ తేదీ నుంచి 5వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్, జూనియర్ పారా అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను జిల్లా దివ్యాంగుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జె.మాధవి బుధవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సహకారంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న దివ్యాంగ క్రీడాకారులు 70135 69514, 93901 31777 కు సంప్రదించి.. పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పారా స్పోర్ట్స్ అసోసియేషన్ కో–ఆర్డినేటర్ వై.శ్రీనివాస్ గౌడ్ కోరారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వి.రామస్వామి, బి.గణేశ్, ఎం.నరసింహ రాజు, హుస్సేన్, రమేష్ బాబు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

9 స్కూల్ బస్సులపై కేసులు



గంభీరం వద్ద స్కూల్ బస్సులను తనిఖీ చేస్తున్న అధికారులు

తగరపువలస : నిబంధనలు ఉల్లంఘించిన స్కూల్, కళాశాలల బస్సులపై రవాణాశాఖ అధికారులు బుధవారం మరోమారు కొరడా ఝుళిపించారు. ఆనందపురం మండలం గంభీరం వద్ద చేపట్టిన తనిఖీలలో 9 బస్సులపై కేసులు నమోదు చేశారు. ఈ నెల 13 నుంచి ఇప్పటి వరకు 25 బస్సులపై కేసులు నమోదు చేసి సీజ్ చేసినట్టు ఉప రవాణా కమిషనర్ రాజారత్నం తెలిపారు. ఈ తనిఖీలు ఇంకా కొనసాగుతాయన్నారు. మోటారు వాహనాల తనిఖీ అధికారులు కె.ప్రవీణ్‌కుమార్, ఏఎస్ గణేష్‌రెడ్డి, మాధవి, రాజారావు, ఎం.ఎస్.వి.ప్రకాష్‌రావు పాల్గొన్నారు.

శిక్షణకు జూ క్యూరేటర్

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కు క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా డిపార్ట్‌మెంటల్ శిక్షణ కోసం వెళ్లారు. నెల రోజుల పాటు న్యూఢిల్లీ, భోపాల్ తదితర ప్రాంతాల్లో ఇచ్చే శిక్షణలో ఆమె పాల్గొంటారు. ఇందుకోసం ఆమె ఈ నెల 16న విశాఖ నుంచి బయలుదేరి వెళ్లారు. ఆమె వచ్చే వరకు జూ క్యూరేటర్(ఎఫ్ఏసీ) బాధ్యతలను అడిషనల్ క్యూరేటర్ జి.మంగమ్మకు అప్పగించారు.

రేపు జాబ్‌మేళా

కంచరపాలెం: జిల్లా ఉపాధి కార్యాలయంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఈ నెల 21 శుక్రవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సీహెచ్ సుబ్బిరెడ్డి(క్లరికల్) తెలిపారు. హెటెరో ల్యాబ్స్, ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, గ్లాడియేటర్ సెక్యూరిటీ సర్వీసెస్, జాబ్ డీలర్స్, హ్యూమన్ పవర్ సర్వీసెస్, ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీల్లో 461 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు ఏర్పాటు చేశారు. రిసెప్షనిస్ట్, అకౌంటెంట్ ట్యాలీ, హౌస్ కీపింగ్, ట్రైనీ కెమిస్ట్, జూనియర్ కెమిస్ట్ ఆపరేటర్ ట్రైనీ, టెక్నీషియన్లు, ట్రైనీ, హెల్పర్స్, సర్వీస్ ట్రైనీ, మెకానిక్ హెల్పర్లు, సెక్యూరిటీ గార్డ్స్, గ్రాఫిక్ డిజైనర్స్ తదితర ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులైన వారు అర్హులు. 18–35 ఏళ్ల వయసున్న పురుష, మహిళా అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరుకావచ్చు. ఆయా ఉద్యోగాలను బట్టి నెలకు రూ.12 వేల నుంచి రూ.28 వేల వరకు జీతం ఉంటుందని.. ఆ రోజు 10 గంటల నుంచి ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయని సుబ్బిరెడ్డి తెలిపారు.

7న నేవీ మారథాన్ ట్రయల్ రన్

విశాఖ స్పోర్ట్స్: ఆరోగ్య కరమైన జీవనశైలి సందేశాన్నిస్తూ వైజాగ్ నేవీ మారథాన్(వీఎన్ఎం)లో భాగంగా సన్నాహక పరుగు పోటీలను నిర్వహిస్తున్నారు. ప్రస్తుత సీజన్‌లో డిసెంబర్ 15వ తేదీన ఈ పరుగు విశాఖ సాగర తీరంలో జరగనుంది. ఇందులో భాగంగా జూలై 7వ తేదీన సన్నాహక పరుగు నిర్వహించనున్నారు. ఇప్పటికే తొలి ఎడిషన్ గత నెల 2వ తేదీన నిర్వహించగా దాదాపు 250 మంది పరుగు పెట్టారు. రెండో ఎడిషన్‌గా జూలై 7వ తేదీన నిర్వహించే ఈ పరుగులో పాల్గొనేందుకు www.vtra.run వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలి. మూడో ట్రయల్ రన్ ఆగస్టు 4వ తేదీన జరగనుంది. మొత్తంగా ఐదు ట్రయల్ రన్స్ నిర్వహించనున్నారు.

● ఈ–పోర్టల్‌లో స్టార్ రేటెడ్ ఉత్పత్తులు

ఇంధనం ఆదా

- ఈఈఎస్ఎల్‌తో ఒప్పందం కుదుర్చుకున్న ఈపీడీసీఎల్
- దేశంలోనే తొలి డిస్కమ్‌గా ఈపీడీసీఎల్
- స్టార్ రేటెడ్ గృహోపకరణాలు నేరుగా కొనుగోలు చేసే అవకాశం



ఈఈఎస్ఎల్ మార్ట్ వెబ్‌సైట్



ఒప్పంద పత్రాలతో ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్, ఈఈఎస్ఎల్ సీఈవో విశాల్ కపూర్

సాక్షి, విశాఖపట్నం : ఇంధన వనరుల ఆదా, పర్యావరణ పరిరక్షణలో ఎప్పటికప్పుడు గేర్ మార్చుతూ ఎనర్జీ ఎఫిషియన్సీలో ప్రపంచానికి ఆదర్శంగా నిలిచేలా దూసుకుపోతున్న ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్(ఈఈఎస్ఎల్) మరో వినూత్న ఆవిష్కరణకు నాంది పలికింది. విద్యుత్ వినియోగదారులకు నేరుగా స్టార్ రేటెడ్ గృహోపకరణాలు అందించేందుకు ఏపీఈపీడీసీఎల్‌తో జతకట్టింది. తమ పోర్టల్ ద్వారా నేరుగా ఇంధన సామర్థ్య ఉత్పత్తుల్ని అందించనుంది. ఈ మేరకు ఈఈఎస్ఎల్ తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది.

డిస్కమ్‌లతో ఈఈఎస్ఎల్ జత

కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ప్రభుత్వ రంగ సంస్థల జాయింట్ వెంచర్ అయిన ఈఈఎస్ఎల్ అత్యాధునిక ఇ–కామర్స్ పోర్టల్ ఈఈఎస్ఎల్ మార్ట్‌ని ఇటీవలే ఆవిష్కరించింది. ఈ కామర్స్ ప్లాట్ ఫామ్‌లో ఎల్ఈడీ బల్బుల నుంచి బీఎల్‌డీసీ ఫ్యాన్లు, ఎయిర్ కండీషనర్ల వరకూ విస్తృతమైన స్టార్ రేటెడ్ ఉత్పత్తుల శ్రేణి విక్రయించేలా పొందుపరిచారు. ఇంధన వనరుల పరిరక్షణకు దోహదపడే ఉత్పత్తుల సమాహారంగా ఈ ప్లాట్‌ఫామ్.. పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలనుకునే ప్రజలకు దోహదపడుతోంది. అయితే ఈ వ్యవస్థను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు డిస్కమ్‌లతో జతకట్టాలని ఈఈఎస్ఎల్ నిర్ణయించింది. ఇందులో భాగంగా ఈపీడీసీఎల్‌తో కీలక ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి, ఈఈఎస్ఎల్ సీఈవో విశాల్ కపూర్ ఒప్పందాలపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం ఈపీడీసీఎల్ వెబ్‌సైట్‌లోకి వెళ్లినా.. బిల్లులు చెల్లించే సమయంలో వాట్సప్ ద్వారా, ఎస్ఎంఎస్ ద్వారా ఈకామర్స్ సైట్ లింక్‌ని వినియోగదారులకు అందజేయనున్నారు. మధ్యవర్తులు లేకుండా నేరుగా వినియోగదారులకు విక్రయించే సౌకర్యాన్ని కల్పించడంతో సరఫరా గొలుసుని క్రమబద్ధీకరిస్తూ సరసమైన ధరల్లో స్టార్ రేటెడ్ ఉత్పత్తులను ఈపీడీసీఎల్ పరిధిలోని వినియోగదారులకు అందజేయడమే తమ లక్ష్యమని సీఈవో విశాల్ కపూర్ స్పష్టం చేశారు.

ఇంధన వినియోగంలో విప్లవాత్మక మార్పు

ప్రస్తుతం 33 శాతం శక్తిని ఆదా చేసే 9 వాట్స్ బల్బులు, ఇన్వర్టర్ బల్బులు, 40 శాతం తక్కువ విద్యుత్‌ని ఖర్చు చేసే 5 స్టార్ ఫ్యాన్‌లు మార్కెట్‌లోకి అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇలాంటి ఉత్పత్తుల వినియోగం ద్వారా ఇంధన పొదుపులో విప్లవాత్మక మార్పులు రాబోతున్నాయని విశాల్‌కపూర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఇంధన పరిరక్షణలో తిరుగులేని శక్తిగా భారత్‌ని ప్రపంచంలో నెంబర్ వన్ స్థానంలో నిలబెట్టాలన్న లక్ష్యంతో తొలి అడుగు విశాఖ నుంచి వేస్తున్నట్లు తెలిపారు. ఒకే ప్లాట్‌ఫామ్‌పై ఉత్పత్తులు, సేవలు, ఫైనాన్సింగ్‌ని తీసుకురావడమే కాకుండా పర్యావరణ స్పృహ పై దేశంలోని ప్రతి పౌరుడికీ బాధ్యత కల్పించేలా అవగాహనతో పాటు ప్రాథమిక విధిగా మార్చే దిశగా ప్రయాణం సాగిస్తున్నామని వివరించారు. డిస్కమ్‌లతో కలిసి లైఫ్ మిషన్‌కు మద్దతునిస్తూ స్ట్రీట్‌లైటింగ్, ఎల్ఈడీ వినియోగం వంటి జాతీయ స్థాయి కార్యక్రమాల్ని సమష్టిగా నిర్వహిస్తున్నామని విశాల్ కపూర్ వివరించారు. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్, వినియోగాల్ని పరిగణనలోకి తీసుకుంటూ సున్నాకు కర్బన ఉద్గారాల నియంత్రణ లక్ష్యాలకు అనుగుణంగా సంపూర్ణ సహకారం అందించేలా అద్భుతమైన మార్పులకు నాంది పలుకుతున్నామన్నారు. ఈ పరికరాలు కొనుగోలు, వినియోగం ద్వారా దేశంలో 20 శాతం వరకూ విద్యుత్‌ని ఆదా చేస్తే.. ఏడాదికి రూ.74 వేల కోట్లు విలువైన ఇంధనాన్ని ఆదా చేయగలమని విశాల్ కపూర్‌తో పాటు ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి స్పష్టం చేశారు.

డ్రగ్స్ నివారణకు యాక్షన్ ప్లాన్



మాట్లాడుతున్న సీపీ రవిశంకర్

విశాఖ సిటీ: గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల నివారణకు వంద రోజుల యాక్షన్ ప్లాన్ ఖరారు చేసినట్లు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ తెలిపారు. బుధవారం పోలీస్ సమావేశ మందిరంలో అన్ని శాఖలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఇందులో డ్రగ్స్ నియంత్రణకు వంద రోజుల యాక్షన్ ప్లాన్‌పై పూర్తి స్థాయిలో చర్చించి కార్యాచరణను సిద్ధం చేశారు. ప్రధానంగా సరిహద్దు జిల్లాల్లోను, ఒడిశా రాష్ట్రంలో గంజాయి సాగు పూర్తిగా నిర్మూలించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. గంజాయి రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు అత్యాధునిక సాంకేతికతను వినియోగించాలని నిర్ణయించారు. డ్రగ్స్ దుష్పరిణామాలపై యువతలో చైతన్యం కలిగించేందుకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టేందుకు కార్యాచరణ రూపొందించారు. స్నిఫర్ డాగ్స్‌తో నగరంలో నిత్యం తనిఖీలు నిర్వహించడం, ఇతర కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో నిర్ణయాలు

- ఎన్‌డీపీఎస్ నేరస్తుల బ్యాంక్ స్టేట్‌మెంట్‌ల సీడీఆర్‌లు, ఐపీడీఆర్‌లు, విశ్లేషణలు, నేరస్తుల ఎలక్ట్రానిక్ ఉపకరణాలను విశ్లేషించడానికి ఒక ప్రత్యేక బృందం ఏర్పాటు.
- నేరస్తుల ప్రత్యేక విచారణ నివేదికల తయారు చేసి విశ్లేషించడం.
- గంజాయి మూలాలపై నిఘా పెట్టడం.
- ఎన్‌డీపీఎస్ కేసుల్లో ప్రమేయం ఉండి రిమాండ్‌లో ఉన్న నేరస్తుల ములాకత్‌లపై ప్రత్యేక నిఘా.
- సముద్ర మార్గాలపై ప్రత్యేక నిఘా.
- హ్యాండ్ హెల్డ్ డిటెక్టర్, డ్రగ్ డిటెక్షన్ కిట్ సురక్షితంగా ఉంచడం.
- స్నిఫర్ డాగ్‌ల సేవలు, నార్కోటిక్స్‌ను గుర్తించేందుకు జాగిలాలకు శిక్షణ
- డ్రగ్స్ దుష్పరిణామాలపై షార్ట్ ఫిల్మ్, పోస్టర్లు, కరపత్రాలతో ప్రచారం.
- సెబ్ ప్రత్యేక టోల్ ఫ్రీ నంబర్ 14500పై విస్తృత ప్రచారం.
- డ్రగ్స్ వినియోగానికి వ్యతిరేకంగా ర్యాలీలు, మారథాన్ల నిర్వహణ.
- ఎన్‌డీపీఎస్ కేసుల్లో ప్రమేయం ఉండి అరెస్టయిన నిందితుల ఛాయాచిత్రాలు, వేలిముద్రలను సేకరించి రికార్డులను భద్రపరచడం.
- బెయిల్ జంపర్లు, ఎన్‌డీపీఎస్ పీటీ కేసులపై ప్రత్యేక దృష్టి.

ఈ సమావేశంలో జాయింట్ సీపీ కె.ఫకీరప్ప, డీసీపీ–1 లక్ష్మీనారాయణ, డీసీపీ–2 ఎం.సత్తిబాబు, డీసీపీ(క్రైమ్) వెంకటరత్నం, అన్ని శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

పలు రైళ్ల రీ షెడ్యూల్.. గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే, వాల్తేర్ డివిజన్ పరిధి పూండి–నౌపడా సెక్షన్ మధ్యలో జరుగుతున్న భద్రత పనుల దృష్ట్యా పలు రైళ్ల గమ్యం కుదించగా, మరికొన్ని రీషెడ్యూల్ చేసినట్టు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు పలాస పాసింజర్ గమ్యం కుదింపు

పలాస–విశాఖపట్నం(07471) పాసింజర్ స్పెషల్ గురువారం పలాస నుంచి కాకుండా శ్రీకాకుళం రోడ్ నుంచి బయల్దేరనుంది. అలాగే విశాఖపట్నంలో బయల్దేరే విశాఖపట్నం–పలాస(7470) పాసింజర్ స్పెషల్ పలాస వరకు కాకుండా శ్రీకాకుళం రోడ్ వరకు మాత్రమే నడుస్తుంది.

రీ షెడ్యూల్ చేసిన రైళ్లు

- బుధవారం రాత్రి 11.40 గంటలకు బయలుదేరాల్సిన సంత్రగచ్చి–చెన్నై ఎగ్మోర్ (06080) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ 3 గంటల ఆలస్యంగా గురువారం తెల్లవారుజామున 2.40 గంటలకు బయల్దేరింది.
- గురువారం మధ్యాహ్నం 12.10 గంటలకు బయలుదేరాల్సిన భువనేశ్వర్–చెన్నై (12830) ఎక్స్‌ప్రెస్ గంట ఆలస్యంగా మధ్యాహ్నం 1.10 గంటలకు బయల్దేరనుంది.

సుందరంగా పిల్లల పార్కు

అధికారులకు జీవీఎంసీ కమిషనర్ ఆదేశం



పిల్లల పార్కులో పనులు పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

ఆరిలోవ: ముడసర్లోవ వద్ద నిర్మిస్తున్న పిల్లల పార్కును సుందరంగా తీర్చిదిద్దాలని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ముడసర్లోవ వద్ద నిర్మాణంలో ఉన్న పిల్లల పార్కు, ముడసర్లోవ రిజర్వాయర్ వెనుక నిర్మాణంలో ఉన్న జీవీఎంసీ నర్సరీని అధికారులతో కలసి బుధవారం ఆయన సందర్శించారు. చిల్డ్రన్ పార్కులో వాకింగ్ ట్రాక్ నిర్మాణం, పార్కులో ఎక్కడ ఏఏ పనులు చేపడుతున్నారు? మరుగుదొడ్లు ఎక్కడ నిర్మిస్తున్నారు? పిల్లలు ఆట పరికరాలు ఎక్కడెక్కడ ఏర్పాటు చేస్తున్నారు? ఎలాంటి ఆట పరికరాలు అందుబాటులోకి తీసుకొస్తున్నారు? తదితర విషయాలను జీవీఎంసీ పర్యవేక్షక ఇంజినీర్ శ్యాంసన్ రాజును అడిగి తెలుసుకున్నారు. పిల్లలు ఆటలు ఆడుకోవడానికి అనుకూలంగా ఉండే విధంగా ఈ పార్కును తీర్చిదిద్దాలని ఆదేశించారు. అనంతరం ముడసర్లోవ రిజర్వాయర్ వెనుక కొత్తగా నిర్మిస్తున్న జీవీఎంసీ నర్సరీని సందర్శించారు. నర్సరీ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. జోన్–2 జోనల్ కమిషనర్ శైలజ వల్లి, కార్యనిర్వాహక ఇంజినీర్ శాంతి రాజు, అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిశోర్, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ వంశీ, సహాయక ఇంజినీర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ కౌన్సెలింగ్ ప్రారంభం



అర్హత పత్రాన్ని అందజేస్తున్న స్టీల్‌ప్లాంట్ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ డీఎస్ సునీత, కన్వీనర్ శ్రీకాంత్



అభ్యర్థులకు సూచనలిస్తున్న అధికారులు



విద్యార్థుల ధ్రువీకరణపత్రాలు పరిశీలిస్తున్న అధికారులు

కంచరపాలెం: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో 2023–24 విద్యా సంవత్సరానికి వివిధ ట్రేడుల్లో ప్రవేశానికి బుధవారం కౌన్సెలింగ్ ప్రారంభమైంది. స్టీల్‌ప్లాంట్ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ డీఎస్ సునీత, ఉపాధి, శిక్షణ శాఖ ప్రిన్సిపాల్, కన్వీనర్ జె.శ్రీకాంత్ ఈ ప్రక్రియను ప్రారంభించారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన కౌన్సెలింగ్‌లో 1 నుంచి 532 ర్యాంక్ వరకు అభ్యర్థులు పాల్గొనగా.. 230 మంది అభ్యర్థులు ప్రభుత్వ ఐటీఐల్లో అర్హత సాధించారు.

రెండవ ర్యాంకర్ దివ్యకు ఎలక్ట్రానిక్ మెకానిక్ ట్రేడ్‌లో అర్హత పత్రాన్ని అధికారులు అందజేశారు. గురువారం 533 నుంచి 1278 ర్యాంక్ వరకు అభ్యర్థులు కంచరపాలెం ప్రభుత్వ ఐటీఐలో జరిగే కౌన్సెలింగ్‌కు ఒరిజినల్ ధ్రువీకరణపత్రాలతో హాజరు కావాలని కన్వీనర్ శ్రీకాంత్ సూచించారు. కౌన్సెలింగ్‌లో పాల్గొన్న తల్లిదండ్రులు, విద్యార్థులకు మంచినీరు, మజ్జిగ పాకెట్లు పంపిణీ చేశారు. వైస్ ప్రిన్సిపాల్ ఉమాశంకర్, ఎ.రమణ, పి.వి.బాలాజీ, సిహెచ్ ఈశ్వరరావు, వంటాకుల శ్రీనివాసరావు, ఎ.జయలక్ష్మి ఈ ప్రక్రియను పర్యవేక్షించారు.

బ్యాడ్మింటన్‌లో రాహుల్ సత్తా



పుల్లెల గోపీచంద్‌తో రాహుల్

అక్కిరెడ్డిపాలెం: బ్యాడ్మింటన్‌లో షీలానగర్‌కు చెందిన కె.రాహుల్ సత్తా చాటుతున్నాడు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన జాతీయ అండర్–14 బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచి బంగారు పతకం కైవసం చేసుకున్నాడు. ప్రముఖ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్ నుంచి ప్రశంసలు పొందాడు. వచ్చే అక్టోబర్‌లో చైనాలో జరిగే ఆసియన్ బ్యాడ్మింటన్ పోటీల కోసం సెలక్షన్ ట్రైల్స్‌కు రాష్ట్రం నుంచి ఎంపికయ్యాడు. షీలానగర్‌కు చెందిన చిరుద్యోగి మోహనరావు కుమారుడైన రాహుల్ చిన్నప్పటి నుంచి బ్యాడ్మింటన్‌పై ఎంతో ఆసక్తి కనబరిచేవారు. కుమారుడి ఆసక్తిని గమనించిన అతని తండ్రి మూడేళ్ల కిందట గాజువాక బీసీ రోడ్డులోని ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ కోచ్ కిరణ్ కుమార్ బెహరా వద్ద చేర్పించారు. అక్కడ బ్యాడ్మింటన్‌లో రాటుదేలి.. రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తున్నాడు. రాహుల్ సింగిల్స్‌లో నేషనల్ సబ్ జూనియర్స్ విభాగంలో 6వ ర్యాంక్, డబుల్స్‌లో ప్రథమ స్థానంలో కొనసాగుతున్నాడని కోచ్ కిరణ్‌కుమార్ తెలిపారు.

బాల్యం తడ‘బడి’!

- బాలబడుల నిర్వహణ అస్తవ్యస్తం
- చిన్నారులకు అందని మధ్యాహ్న భోజనం
- తరగతుల నిర్వహణ అంతంత మాత్రం
- విద్యాశాఖ కమిషనర్ ఆదేశించినా పట్టని అధికారులు
- జిల్లాలోని 37 కేంద్రాల్లో 900 మంది విద్యార్థులు

భరత్‌నగర్ పేరుతో నగరంలోని 90వ వార్డు పరిధి బుచ్చిరాజుపాలెంలో(ఎస్ఎస్టీఎల్ గేటుకు ఎదురుగా) నిర్వహిస్తున్న బాల్యం బడిలో నలుగురు చిన్నారులు మాత్రమే ఉన్నారు. చిన్నారులకు మధ్యాహ్న భోజనం కూడా అందడం లేదు. ఈ కేంద్రం పనితీరు ఎలా ఉంది.? పిల్లల వ్యక్తిత్వ వికాసం దోహదపడేలా ఇక్కడ నేర్పిస్తున్న అంశాలు ఎంటనేది అడిగేవారు లేరు. పాడుబడిన భవనంలా ఉన్న అక్కడ అసలు ‘బాల్యం బడి’ అంటూ ఒకటి ఉందా అనే సందేహం కలుగుతుంది. సంబంధిత శాఖల అధికారుల పర్యవేక్షణాలేమికి ఇదో నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తోంది.



విశాఖ నగరంలో ఈ భవనంలోనే బాల్యం బడి నిర్వహిస్తున్నారు

విశాఖ విద్య: బడులు తెరిచి వారం రోజులు గడుస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో అంతా సందడిగా ఉంది. కానీ వీటికి అనుసంధానంగా జీవీఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాల్యం బడులు సవ్యంగా సాగడం లేదు. కేంద్రాల నిర్వహణ తీరు అస్తవ్యస్తంగా ఉంది. ఈ కేంద్రాలకు రోజువారీగా ఎంతమంది చిన్నారులు హాజరవుతున్నారనేది పరిశీలించేవారు లేకపోవడం గమనార్హం. జీవీఎంసీ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో ఈ కేంద్రాలను పూర్తిగా గాలికొదిలేశారు.

జిల్లాలో 37 కేంద్రాలు

జీవీఎంసీ అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్(వీసీడీ) ఆధ్వర్యంలో వీటిని నిర్వహిస్తున్నారు. నగరంలోని వెనుకబడిన కాలనీలు, స్లమ్ ఏరియా(మురికవాడలు)ల్లో వీటిని ఏర్పాటు చేశారు. నగరంలో మొదట్లో 61 బాల్యం బడి కేంద్రాలు ఉండగా.. వీటిలో 24 కేంద్రాలను నాలుగేళ్ల కిందట స్త్రీ శిశు సంక్షేమ శాఖకు అప్పగించారు. ఇంకా 37 కేంద్రాలను జీవీఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. వీటిలో 900 మంది చిన్నారులు విద్యనభ్యసిస్తున్నారు.

బడిబాట పట్టించాలనేది లక్ష్యం

మూడు నుంచి ఆరేళ్ల మధ్య వయసు గల చిన్నారులకు ఆటపాటలతో విద్యనందించి, వారిని బడిబాట పట్టించాలనేది బాల్యం బడి కేంద్రాల లక్ష్యం. ప్రతీ కేంద్రంలో ఒక టీచర్, ఒక ఆయా విధుల్లో ఉన్నారు. కేంద్రాల పర్యవేక్షణకు నలుగురు సూపర్‌వైజర్లు, జీవీఎంసీ పరిధిలో వీటి కోసమని ప్రత్యేకంగా ఓ విభాగం ఉంది. బాల్యం బడుల పర్యవేక్షణ చూసే ప్రాజెక్టు అధికారి ఇటీవల ఉద్యోగ విరమణ చేశారు. ఆ బాధ్యతలు ఇంకా ఎవ్వరికీ అప్పగించలేనట్లు తెలుస్తోంది. దీంతో కేంద్రాలపై పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది.

అర్ధాకలితో చిన్నారులు

మూడేళ్ల నుంచి ఆరేళ్ల వయసు మధ్య గల చిన్నారుల కోసం అంగన్ వాడీల్లో ఇప్పటికే ప్రీ స్కూళ్ల నిర్వహిస్తున్నారు. రుచికరమైన పౌష్టికాహారం అందిస్తుండటంతో పాటు, ఆటపాటలతో చదువులు చెబుతున్నారు. వీటితో సంబంధం లేకుండా జీవీఎంసీ ఆధ్వర్యంలో బాల్యం బడి కేంద్రాలను ప్రత్యేకంగా నిర్వహిస్తున్నారు. కానీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు జీవీఎంసీ అధికారులు ఎటువంటి పౌష్టికాహారం పెట్టడం లేదు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు కేంద్రాలను నిర్వహిస్తున్నా.. పిల్లలు ఆకలితో అలమటిస్తుండటంతో వారి తల్లిదండ్రులు మధ్యాహ్నం వేళలో ఇళ్లకు తీసుకుపోతున్నారు. ఫలితంగా బాల్యం బడి కేంద్రాల్లో ఆశించిన ఫలితాలు రావడం లేదు.



కేంద్రంలోని చిన్నారులు

కమిషనర్ ఆదేశించినా..

బాల్యం బడి కేంద్రాలను ఎక్కువగా పాఠశాలల ప్రాంగణంలోనే నిర్వహిస్తున్నారు. ఇటీవల విద్యాశాఖ కమిషనర్ జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు కప్పరాడ ఏరియాలో బాల్యం బడిని పరిశీలించి పలు సూచనలు చేశారు. సమీప పాఠశాలల నుంచి చిన్నారులకు మధ్యాహ్న భోజనం అందించాలని ఆదేశించారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో టీచర్లకు భీమునిపట్నం డైట్‌లో శిక్షణ ఇచ్చారు. బడులు తెరిచి వారం రోజులు కావస్తున్నా.. కేంద్రాల్లోని చిన్నారులు ఆకలితో తమకు సంబంధం లేనట్లుగా సంబంధిత శాఖల వారు వ్యవహరిస్తుండటం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున జోక్యం చేసుకుని బాల్యం బడి సవ్యంగా సాగేలా లేదంటే కనీసం అంగన్‌వాడీల్లో విలీనం చేసేలా చొరవ తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

చలన చిత్ర కార్మికులకు ఈశ్రమ్ నమోదు



ఈశ్రమ్ కార్డు నమోదుకు హాజరైన చలన చిత్ర కార్మికులు

సీతంపేట: ఈశ్రమ్ కార్డు ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సాయం నేరుగా పొందేందుకు అవకాశం లభిస్తుందని ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్‌ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడు తోరంరాజా అన్నారు. చలన చిత్ర పరిశ్రమలో పని చేస్తున్న కార్మికులకు ఈశ్రమ్ కార్డు నమోదు కార్యక్రమాన్ని బుధవారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈశ్రమ్ కార్డు ఉంటే హెల్త్ కార్డులు పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. చలన చిత్రపరిశ్రమ కార్మికులు అందరూ ఈశ్రమ్ కార్డు కోసం నమోదు చేసుకోవాలని కోరారు. ఏపీ మా అధ్యక్షుడు ముత్తుకూరు నరసింహులు, ప్రధాన కార్యదర్శి సలాది అచ్యుత రామస్వామి, విశాఖ జిల్లా అధ్యక్షుడు భయ్యా శ్రీనివాసరావు, కోశాధికారి పూల శ్రీను, కార్యదర్శి జి. విజయరమణి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చెల్లని చెక్కు కేసులో ఒకరికి ఏడాది జైలు

విశాఖ లీగల్: చెల్లని చెక్కు జారీ చేసిన వ్యక్తికి ఏడాది జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ నగరంలోని 7వ స్పెషల్ మెజిస్ట్రేట్ డి.విశ్వనాథం బుధవారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో 3 నెలలు జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. ఫిర్యాదిదారు తరపు న్యాయవాది కదిరి రాము తెలిపిన వివరాలివీ.. అక్కయ్యపాలేనికి చెందిన ఫిర్యాదిదారు కరుభుక్త పద్మ నుంచి అక్కిరెడ్డిపాలెం ప్రాంతానికి చెందిన నిందితుడు ఆదారి శాంతారాం, అతని భార్య ఆదారి లక్ష్మీకాంతం 2021 ఫిబ్రవరి 14న రూ.12 లక్షలు అప్పుగా తీసుకున్నారు. ప్రామిసరీ నోటు రాసి ఇచ్చారు. పద్మ ఎన్నిపర్యాయాలు అప్పు తీర్చమని అడిగినా భార్యాభర్తలు స్పందించలేదు. ఎట్టకేలకు ఆదారి శాంతారాం భార్యాభర్తలిద్దరి తరపున గతేడాది జనవరి 23న రూ.10 లక్షల చెక్కును ఆమెకు ఇచ్చారు. పద్మ ఆ చెక్కును బ్యాంక్ ఖాతాలో జమ చేయగా.. తగినన్ని నిధులు లేని కారణంగా బౌన్స్ అయింది. దీంతో బాధితురాలు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు.

7న ఏపీజీఈ సంఘానికి ఎన్నికలు

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం(ఏపీజీఈ) జిల్లా కార్యవర్గం ఎన్నికలు జూలై 7న నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు పి.ఎం.జవహర్ లాల్ తెలిపారు. విశాఖ జిల్లా యూనిట్ కార్యవర్గం కాలపరిమితి ముగియడంతో ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికల అధికారిగా వి.రాజేశ్వరి, అసిస్టెంట్ ఎన్నికల అధికారిగా వి.ధనరాజు, పరిశీలకుడిగా పి.ఎం.జవహర్‌లాల్ నియమితులయ్యారు.

యువతి ఆత్మహత్యాయత్నం

రెండు వారాల్లో ఇది మూడోసారి

ఆరిలోవ: సముద్రంలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువతిని ఆరిలోవ పోలీసులు రక్షించారు. తెన్నేటిపార్కు వద్ద జరిగిన ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలివీ.. అనకాపల్లికి చెందిన ఓ మూగ యువతి, నగరానికి చెందిన మూగ యువకుడు వాల్తేరులోని చెవిటి, మూగు స్కూల్‌లో చదువుకున్నారు. ఆ సమయంలోనే వారిద్దరూ ప్రేమించుకున్నారు. ప్రస్తుతం ఆ యువతి అనకాపల్లిలో ఉంది. కొద్దిరోజుల కిందట విశాఖ వచ్చి ఆ యువకుడిని కలిసింది. ఏమైందో గానీ బుధవారం సాయంత్రం తెన్నేటి పార్కు వద్ద సముద్రంలో దిగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఇది గమనించిన సందర్శకులు కేకలు వేశారు. అక్కడకు సమీపంలోని జోడుగుళ్లపాలెం అవుట్‌పోస్ట్ పోలీసులు వెంటనే స్పందించి యువతిని రక్షించి స్టేషన్‌కు తరలించారు. అనకాపల్లిలో ఉన్న ఆమె తల్లిదండ్రులను రప్పించి అప్పగించారు. యువకుడిని ప్రేమించిన వ్యవహారంలో ఎంత చెప్పినా తమ మాట వినడం లేదని తల్లిదండ్రులు పోలీసులకు చెప్పి.. ఆ యువతిని తీసుకెళ్లారు. కాగా.. రెండు వారాల్లో ఆ యువతి మూడుసార్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది.మొదట టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి, ఈ నెల 13న ఎంవీపీ పోలీస్ స్టేషన్ పరిధిలో యువతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు సీఐ గోవిందరావు తెలిపారు.

నివేదిక ఆధారంగా చర్యలకు సిఫారసు

మహారాణిపేట : కేజీహెచ్‌లో పసి బిడ్డ కోసం తండ్రి తీవ్ర అవస్థలు పడిన విషయాన్ని సీరియస్‌గా తీసుకుని సుమోటోగా స్వీకరిస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం పేర్కొన్నారు. దీనిపై ఒక ప్రకటన విడుదల చేశారు. కేజీహెచ్ గైనిక్ వార్డులో మంగళవారం కాకినాడలోని కోటనందూరుకు చెందిన అల్లు శిరీష పసి కందుకు జన్మనిచ్చింది. పుట్టిన శిశువు అనారోగ్యానికి గురి కావటంతో పిల్లల వార్డులోనిఐసీయూలో అబ్జర్వేషన్‌లో ఉంచాలని వైద్యులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పనికందును తీసుకెళ్లడానికి సిబ్బంది ముందుకు రాకపోవడంతో ఆయా చేతుల్లో వేసుకుని తీసుకెళ్తుండగా ఆమె వెనుక పసిబిడ్డ తండ్రి విష్ణుమూర్తి ఆక్సిజన్ సిలిండర్ భుజంపై మోసుకెళ్తున్న వీడియో వైరలయింది. దీనిపై ఆస్పత్రి ఉన్నతాధికారులు తక్షణ నివేదిక అందించాలని ఆదేశాలు జారీ చేసినట్టు సీతారాం తెలిపారు.

చికిత్స పొందుతూ చిన్నారి మృతి

తగరపువలస: ఆనందపురం మండలం వెల్లంకి పంచాయతీ గారిపేటకు చెందిన ఏడాదిన్నర నోక్షిత్ చికిత్స పొందుతూ బుధవారం సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రిలో మృతి చెందాడు. ఆనందపురం పోలీసులు తెలిపిన వివరాలివీ.. వ్యవసాయ కూలీలైన మురపాల లక్ష్మణ్, కల్యాణిలకు ఇద్దరు కుమారులు. మంగళవారం ఇంటి బయట అన్నయ్య హిమాన్‌తో ఆడుకుంటున్న నోక్షిత్ తరువాత కనిపించలేదు. దీంతో తల్లిదండ్రులు చుట్టుపక్కల ప్రాంతాలు గాలించినా కనిపించలేదు. చివరకు బాత్‌రూమ్‌లో సగం నీరు ఉన్న టబ్‌లో నోక్షిత్ అచేతనంగా పడి ఉన్నట్టు గుర్తించి వెంటనే అందుబాటులోని గ్రామీణ వైద్యుని వద్దకు తరలించారు. తరువాత మెరుగైన చికిత్స కోసం సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రికి తరలించి ఐసీయూలో ఉంచి చికిత్స అందించారు. అక్కడే చికిత్స పొందుతూ మరణించినట్లు ఆనందపురం పోలీసులు తెలిపారు.

శిక్షణకు వేళాయె

- భావి ఉపాధ్యాయులకు బంగారు భవిష్యత్
- నేటి నుంచి డీఎడ్ తరగతులు
- భీమునిపట్నంలో ప్రభుత్వ డైట్ కాలేజీ
- ఈ ఏడాది మొదటి ఫేజ్‌లో 47 మందికి అడ్మిషన్లు



భీమునిపట్నంలోని ప్రభుత్వ డైట్ కళాశాల

విశాఖ విద్య: డిప్లమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈఎల్ఈడీ) కోర్సు ప్రవేశాలు పొందిన విద్యార్థులకు గురువారం నుంచి తరగతులు ప్రారంభంకానున్నాయి. 2024–25 విద్యా వార్షిక క్యాలెండర్‌కు అనుగుణంగా పాఠ్యాంశాల బోధనపై విద్యాశాఖాధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. భావి ఉపాధ్యాయులుగా మారే క్రమంలో శిక్షణ కోసమని వస్తున్న విద్యార్థులకు తొలి రోజు స్వాగత వేడుక, పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించేలా డైట్ కాలేజీలో తగిన ఏర్పాట్లు చేశారు. ఉపాధ్యాయ విద్య తీరుతెన్నులపై మూడు రోజులపాటు, డైట్ కాలేజీ సీనియర్ అధ్యాపకులతో సూచనలు, సలహాలు ఇచ్చేలా షెడ్యూల్ సిద్ధం చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో భీమునిపట్నంలో మాత్రమే ఉపాధ్యాయ(డీఎల్ఈడీ) శిక్షణ కాలేజీ అందుబాటులో ఉంది. అది కూడా ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తుండటంతో దీనికి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 26 జిల్లాల నుంచి విద్యార్థులు అడ్మిషన్లు పొందారు.

డీఎడ్ శిక్షణతో జాబ్ గ్యారెంటీ

రెండేళ్ల కాలవ్యవధితో కూడిన డిప్లమో ఇన్ ఎలిమెంటరీ శిక్షణ పొందిన వారికి ప్రభుత్వ, ప్రైవేటు సెక్టార్లలో త్వరితగతిన ఉద్యోగ అవకాశాలు దక్కుతున్నాయి. ప్రీ ప్రైమరీ, ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులు డీఎడ్ కోర్సు చేసిన వారికి ప్రాధాన్యత ఇస్తుండటంతో వీటికి మంచి డిమాండ్ ఉంది. భీమునిపట్నం ప్రభుత్వ డైట్ కాలేజీలో నిష్ణాతులైన సీనియర్ అధ్యాపకులు పనిచేస్తుండటంతో విద్యార్థులకు నైపుణ్యతతో కూడిన శిక్షణ అందుతోంది. జాబ్ గ్యారెంటీ కోర్సు కావటంతో శిక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఏకైక కళాశాల

ఉమ్మడి విశాఖ జిల్లాకు సంబంధించి భీమునిపటన్నంలో డైట్ కాలేజీ నిర్వహిస్తున్నారు. ఇక్కడ వంద సీట్లు అందుబాటులో ఉండగా, 2024–25 విద్యా సంవత్సరానికి మొదటి ఫేజ్‌లో 47 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. రెండో విడత కౌన్సెలింగ్‌పై అధికారులు దృష్టి సారించారు.

విద్యార్థుల అభ్యున్నతికి కృషి



2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి డీఎల్ఈడీ కోర్సు మొదటి సంవత్సరం తరగతులు గురువారం నుంచి ప్రారంభిస్తున్నాం. తొలి మూడు రోజులు కోర్సుపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించనున్నాం. నైపుణ్యతతో కూడిన శిక్షణ అందించి, విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తాం.

–ఎం.జ్యోతికుమారి, ప్రిన్సిపాల్, ప్రభుత్వ డైట్ కాలేజీ, భీమునిపట్నం

నేతన్న నేస్తానికి మంగళం !

- మేనిఫెస్టోలో ప్రకటించని టీడీపీ
- సంక్షేమ పథకాలు కొనసాగిస్తామంటూ చంద్రబాబు ప్రగల్భాలు
- ఈ ఏడాది ఆర్థికసాయం అందే అవకాశం లేదని నేతన్నల్లో ఆందోళన
- కులవృత్తి వదిలి కూలికి వెళ్లాల్సిందేనా అంటూ ఆవేదన
- నేతన్నలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏటా రూ.24 వేల ఆర్థిక సహాయం
- ఐదేళ్ల పాటు ఆదుకున్న జగన్ సర్కార్

నక్కపల్లి : నేతన్నకు మళ్లీ కష్టాలు మొదలయినట్లే. గత ప్రభుత్వం అమలు చేసిన నేతన్న నేస్తం పథకానికి చంద్రబాబు సర్కారు మంగళం పాడినట్టే. టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలో నేతన్న నేస్తం పథకం గురించి ప్రస్తావన లేకపోవడంతో నేత కార్మికుల్లో ఈ అనుమానాలు, ఆందోళన మొదలయ్యాయి. ఈ ఏడాది అందాల్సిన ఆర్థిక సాయం ఇక రాదన్న భయాందోళనలు వారిలో వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో మగ్గానికి మంచిరోజులు వచ్చాయి. కులవృత్తికి దూరమైన నేతన్న వైఎస్సార్‌సీపీ సర్కారు ఇచ్చిన ఆర్థిక సాయంతో మగ్గం బాట పట్టాడు. కూలిపనులకు వెళ్లే నేతన్న జగనన్న సర్కారు ఇచ్చిన ఆర్థిక సాయంతో కులవృత్తిని చేసుకుంటూ ఆనందంగా గడిపాడు. భార్యాభర్తలు ఇద్దరూ కష్టపడి ప్రభుత్వ సాయంతో వస్త్రాలు తయారు చేస్తూ రోజుకు రూ.1000 పైనే సంపాదించుకునే వారు. ప్రభుత్వం మారింది. పథకాలు మారుతున్నాయి. వీటి జాబితాల్లో నేతన్న నేస్తం పథకం కూడా చేరింది. దీంతో నేతన్నల్లో ఆందోళన మొదలైంది. పాదయాత్ర ద్వారా చేనేత కార్మికుల కష్టాలు స్వయంగా తెలుసుకున్న జగన్‌మోహన్‌రెడ్డి మనందరి ప్రభుత్వం అధికారంలోకి వస్తే నేత కార్మికులకు పెట్టుబడి సాయంగా నెలకు రూ.2వేల చొప్పున ఏటా రూ.24వేలు ఒకే విడతలో జమ చేస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాది నేతన్న నేస్తం పథకాన్ని అమల్లోకి తెచ్చారు. మగ్గం కలిగిన ప్రతి కుటుంబానికి ఏటా రూ.24వేల చొప్పున జమ చేయడానికి చర్యలు చేపట్టారు. దీంతో కులవృత్తికి దూరమై కూలి పనులు చేస్తూ జీవనం గడిపే నేతన్నలంతా తిరిగి మగ్గం బాట పట్టారు. చేనేత కార్మికులకు జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన భరోసా చేనేత రంగానికి పూర్వ వైభవం తీసుకు వచ్చింది. జిల్లాలో 17 (చోడవరం, వేముల పూడి, నక్కపల్లి, గొడిచర్ల, బంగారయ్యపేట,గొడిచర్ల,పాయకరావుపేట, బూరుగు పాలెం, నర్సీపట్నం, కోటవురట్ల,గుండుపాల, రోలుగుంట, ఏ కోడూరు,యలమంచిలి,ఎంబీ పట్నం, కొత్తపేట, సీహెచ్ఎల్ పురం) చేనేత సహకార సంఘాలున్నాయి. 60 వేలకుపైగా చేనేత సామాజిక వర్గానికి చెందిన వారు ఉన్నారు. సుమారు 324 కుటుంబాలు మగ్గాలు కలిగి నేతన్న నేస్తం పథకానికి అర్హత సాధించాయి. ఒక్క పాయకరావుపేట నియోజకవర్గంలోనే 130 మందికి పైగా లబ్ధిదారులున్నారు. వీరందరికీ గత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తొలి విడత నేతన్ననేస్తం సాయంకింద 2019 అక్టోబరులో రూ.24వేలు, రెండో ఏడాది 2020 జూన్‌లోను, 2021 జూన్10న మూడోవిడత, 2022 ఆగస్టులో నాలుగో విడత ఇలా వరుసగా ప్రతి ఏడాది ఆర్థిక సాయాన్ని జమ చేసింది. ఈ సొమ్ముతో చేనేత కార్మికులు ముడిసరుకు కొనుగోలు చేసి వస్త్రాలు తయారు చేసి విక్రయిస్తూ ఉపాధి పొందారు. ప్రస్తుత ప్రభుత్వం నేతన్న నేస్తం గురించి ప్రస్తావించలేదు. ప్రత్యామ్నాయంగా మగ్గాలు వాడే కార్మికులు ఉచిత విద్యుత్ అందిస్తానని మాత్రమే హామీ ఇచ్చింది.ఈ హామీ మాకేమాత్రం ఉపయోగపడదని, నగదు రూపంలో ఇస్తే తాము ముడిసరుకు కొనుగోలు చేసి కులవృత్తిని చేసుకుంటామని నేతన్నలు చెబుతున్నారు. ఈ ఏడాదినుంచి ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందే అవకాశాలు సన్నిగిల్లడంతో నేతన్నల్లో ఆందోళన మొదలైంది. మళ్లీ మగ్గం వదిలి కూలి బాట పట్టాల్సిన పరిస్థితులు రానున్నాయని వారు వాపోతున్నారు.

పథకాన్ని కొనసాగించాలి

గత ప్రభుత్వంలో మాకు ఏడాదికి రూ.24వేల చొప్పున ఐదేళ్లలో రూ.1.20లక్షలు ఆర్థిక సాయం అందింది.ఈ నిధులతో ముడిసరుకు కొనుగోలు చేసి వస్త్రాలు తయారు చేసి విక్రయిస్తూ ఉపాధి పొందాం. కులవృత్తిని కాపాడుకున్నాం. చంద్రబాబు ప్రభుత్వం నేతన్న నేస్తం పథకానికి బదులు ఉచిత విద్యుత్ ఇస్తామని చెబుతున్నారు. దీని వల్ల మాకు పెద్దగా ఉపయోగం ఉండదు. ప్రతినెలా పెట్టుబడికోసం సాయం అందిస్తేనే మగ్గాలు నేసే పరిస్థితి ఉంటుంది. అప్పు చేసి పెట్టుబడి పెట్టే పరిస్థితి ప్రస్తుతం లేదు. ఈ పథకాన్ని కొనసాగించాలని కోరుకుంటున్నాం.

–అప్పలరాజు, నేత కార్మికుడు, నక్కపల్లి

పునరాలోచించాలి

నేత కార్మికులను ఆదుకుని కులవత్తిని కాపాడిన నాయకుడు జగనన్న. చతికిల పడిన చేనేత రంగానికి పూర్వవైభవం తీసుకువచ్చి వలసపోయిన నేతన్నలను తిరిగి మగ్గం బాట పట్టేలా చర్యలు తీసుకున్నారు. చంద్రబాబు సర్కారు ఈ పథకానికి పేరు మార్చి అయినా సరే కొనసాగిస్తే బాగుంటుంది. పెట్టుబడి సాయం చేకుండా ఉచిత విద్యుత్ ఇస్తామని చెప్పడం భావ్యం కాదు. నేతన్న నేస్తం పథకంపై పునరాలోచన చేసి కొనసాగిస్తే చేనేత రంగం అభివృద్ధి చెందుతుంది. ఆర్థిక సాయం చేయకపోతే నేతన్నలంతా మళ్లీ మగ్గాలకు దూరమయ్యే పరిస్థితులు నెలకొంటాయి.

– ఎల్లేటి సత్తిబాబు, చేనేత సామాజికవర్గ నేత, నక్కపల్లి

యువ శాస్త్రవేత్త శిరీషకు రాష్ట్ర స్థాయి ఉత్తమ పురస్కారం

దేవరాపల్లి: మండలంలోని మారేపల్లికి చెందిన అవుగడ్డ బేగం మేరీ శిరీషకు రాష్ట్ర స్థాయి ఉత్తమ యువ శాస్త్రవేత్త పురస్కారం లభించింది. బాపట్లలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయంలో బుధవారం జరిగిన 56వ స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, ఐకార్(ఐసీఏఆర్) డైరెక్టర్ జనరల్ (న్యూఢిల్లీ) డాక్టర్ హిమాన్షు పాటక్, ఆచార్య ఎన్జీరంగా అగ్రికల్చర్ యూనివర్శిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మి చేతులు మీదుగా ఆమె పురస్కారాన్ని స్వీకరించా రు. బంగారు పతకంతో పాటు ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈమె ప్రస్తుతం యలమంచిలి మండలం కొక్కిరాపల్లి అగ్రికల్చరల్ రీసెర్చ్ సెంటర్‌లో శాస్త్రవేత్తగా పనిచేస్తున్నారు. శిరీష రాష్ట్ర ఉత్తమ పురస్కారంతో పాటు గోల్డ్ మెడల్‌ను అందుకోవడం పట్ల మారేపల్లిలోని ఆమె తల్లిదండ్రులు అవుగడ్డ అప్పలనాయుడు,సత్యవతితో పాటు ఇతర కుటుంబ సభ్యులు,గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. పలువురు ఆమెకు అభినందనలు తెలిపారు.



రాష్ట్ర గవర్నర్ చేతులు మీదుగా అవార్డు, గోల్డ్ మెడల్ అందుకుంటున్న యువ శాస్త్రవేత్త శిరీష

ప్రకృతి ఒడిలో సాగిపోయేలా..

తాటిగుడ, కటికి జలపాతాల సందర్శకులకు ఇబ్బందులు తప్పనున్నాయి. ఆయా ప్రాంతాల వెళ్లే రహదారులను విస్తరించేందుకు గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఇప్పటికే కటికి జలపాతం రోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. తాటిగుడ జలపాతానికి వెళ్లే రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించేందుకు గిరిజన సంక్షేమశాఖ ఇంజినీరింగ్ అధికారులు చర్యలు చేపట్టారు. ఇవి పూర్తయితే ప్రకృతి ఒడిలో జలపాతాల జలపాతాల వద్దకు వెళ్లేలా రోడ్ల సౌకర్యం అందుబాటులోకి రానుంది.



బొర్రా గేటువలస నుంచి కటికి గ్రామానికి రూ.12.90 కోట్లతో నిర్మిస్తున్న రోడ్డు

- తాటిగుడ, కటికి జలపాతాలకు పక్కా రోడ్ల నిర్మాణం
- రూ.20 కోట్లు వెచ్చించిన గత ప్రభుత్వం
- నాలుగు నెలల్లో పూర్తి కానున్న గేటువలస– కటికి రహదారి పనులు
- పెద్దూరు మీదుగా తాటిగుడకు అందుబాటులోకి రానున్న రోడ్డు సౌకర్యం



కటికి జలపాతం

అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలైన తాటిగుడ, కటికి జలపాతాలకు మంచిరోజులొచ్చాయి. ఈ రెండింటిని తిలకించేందుకు దూర ప్రాంతాల నుంచి భారీగా పర్యాటకులు వస్తుంటారు. అయితే గతంలో ఆయా ప్రాంతాలకు వెళ్లేందుకు రహదారి సౌకర్యం లేక సందర్శకులు ఇబ్బందులు పడేవారు. రాళ్లు తేలిన రోడ్లపై సాహస ప్రయాణాలు సాగించి జలపాతాల వద్దకు చేరుకునేవారు. పర్యాటకుల వాహనాల తాకిడి వల్ల రోడ్డు ఇరుకుగా మారడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తేది. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారింది. సందర్శకులు ఎదుర్కొంటున్న సమస్యను గుర్తించిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రోడ్ల నిర్మాణంపై దృష్టి సారించింది.

'తాటిగుడ'కు రూ.7.10 కోట్లు..

గతంలోని తాటిగుడ జలపాతానికి రోడ్డు సౌకర్యం ఉండేది కాదు. పర్యాటకశాఖ ఆధ్వర్యంలో పెద్దూరు నుంచి జలపాతం వరకు సీసీరోడ్డు నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం జాతీయ ఉపాధిహామీ పథకంలో పెద్దూరు మీదుగా జలపాతం వరకు 40 అడుగుల వెడల్పున సీసీరోడ్డుకు రూ.6 కోట్లు, తాటిగుడ గ్రామ సమీపంలో వంతెన నిర్మాణానికి 1.10 కోట్ల మేర నిధులు మంజూరయ్యాయి. అయితే రోడ్డును 40 అడుగుల వెడల్పున విస్తరించడం వల్ల గిరిజనుల ఇళ్లను తొలగించాల్సి ఉంది. దీనిపై వారంతా కలెక్టర్‌ను కలిసి విన్నవించుకున్నారు. సమస్య పరిష్కరించిన వెంటనే గిరిజన సంక్షేమశాఖ పర్యవేక్షణలో పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. మార్చిలో నిధులు మంజూరయ్యాయి. ఈ పనులను మూడు నుంచి నాలుగు నెలల్లోగా పూర్తి చేస్తామని ట్రైబల్ వెల్ఫేర్ ఏఈ గణేష్ తెలిపారు.

కటికి రోడ్డుకు రూ.12.90 కోట్లు..

కటికి జలపాతానికి వెళ్లేందుకు పర్యాటకులు గతంలో తీవ్ర ఇబ్బందులు పడేవారు. రాళ్లు తేలిన రోడ్లపై ప్రయాణించాల్సిన పరిస్థితి ఉండేది. 2018లోని పంచాయతీరాజ్‌శాఖ ప్రధానమంత్రి గ్రామసడక్ యోజన పథకంలో గేటువలస నుంచి కటికి గ్రామానికి రూ.2.52 కోట్లతో నాలుగు కిలోమీటర్ల పొడవునా తారు రోడ్డు నిర్మించడంతో ఇబ్బందులు తప్పాయి. ఈ నేపథ్యంలో 40 అడుగుల విస్తరణకు జాతీయ ఉపాధి హామీ పథకంలో రూ.12.90 కోట్లు గత మార్చి నెలలో మంజూరయ్యాయి. పంచాయతీరాజ్ పర్యవేక్షణలో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కొద్దిరోజుల్లో పనులు పూర్తి చేస్తామని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం అసిస్టెంట్ ఇంజినీరు సాయి విజయ్ తెలిపారు.